"నన్ను పెళ్లిచేసుకోవడం నీకు ఇష్టమేనా?" అని అడిగాడు శంకరం. సిగ్గుతో తలవంచుకుంది గౌరి.

"త్వరగా చెప్పు. ఇప్పుడు సిగ్గుపడ్డానికి టైము లేదు. మామయ్య వచ్చేస్తాడు" అని హెచ్చరించాడు శంకరం.

గౌరి మాట్లాడలేదు.

"చిన్నప్పటినుండి మన ఇద్దరికీ పెళ్లి చేస్తానని మా అమ్మ అంటూండేది. ఆమె బ్రతికే ఉంటే మన పెళ్లి ఏనాడో జరగవలసి ఉండేది. కాని, నాకు ఆ అదృష్టంలేదు. మీ తండ్రికి మన పెళ్లి ప్రస్తావన లేనేలేదు. నేనంటే నీకు నిజంగా ఇష్టం ఉంటే చెప్పు. సిగ్గుపడటం దేనికి ? నువ్వు కాస్త ధైర్యం చెప్పావంటే మామయ్యచేత ఎలాగైనా ఒప్పిస్తాను." అన్నాడు శంకరం.



"నువ్వేదీ ఉద్యోగం చెయ్యవని మా నాన్నకు కోపం" అన్నది గౌరి.

"లక్ష ఉద్యోగాలు చేస్తాను. కాని, కాస్తోకూస్తో బి. ఏ ప్యాసయినవాణ్ణి. గుమాస్తాగిరీ చెయ్యడం నాకు ఇష్టం ఉండదు" అన్నాడు శంకరం.

"పెద్ద ఉద్యోగాలు వాళ్లు ఇవ్వరు" అన్నది గౌరి.

"అందుకే మనం ఖాళీగా ఉండిపోవలసివచ్చింది. ఇంతకి నేను అడిగిన దానికి సమాధానం ఇచ్చావు కావు" అన్నాడు శంకరం.

"నాకు ఇష్టంఉంటే ఏం లాభం — అందరికీ ఇష్టం ఉండాలి కదూ" అన్నది గౌరి తలదించుకుని.

"అంటే నీకు ఇష్టమేనన్నమాట. ఎంత ఆనందకరమైనమాట విన్నాను. ఇన్నాళ్లకు నా అదృష్టం పండింది. ఇక ఎలాగైనా మన పెళ్లి జరిగి తీరవలసిందే. మామయ్య రానీ, వెంటనే తేల్చిపారేస్తాను" అన్నాడు శంకరం. మాట పూర్తి కాకుండానే మామయ్య వచ్చాడు.

"ఏమిట్రా తేల్చిపారేస్తావ్ ?" అన్నాడు మామయ్య.

"నా పెళ్లిమాట" అన్నాడు శంకరం ధైర్యంగా.

"నీకు పెళ్లిఒక్కటే తక్కువ" అన్నాడు మామయ్య.

"అంత చవకగా కనిపిస్తున్నానా ?" అన్నాడు శంకరం.

"ఒక ఉద్యోగంలేదు; పయాపైసా ఆర్జించే శక్తిలేదు. మీ తండ్రి సంపాదించిన ఆస్తికాస్తా ఎగరగొట్టేశావు. పెళ్లి చేసుకొంటే, పెళ్లాం బిడ్డల్ని ఎలాగ పోషిద్దామనుకున్నావురా ?" అన్నాడు మామయ్య.

"కాగితంపెడ్తే కావలిసినన్ని ఉద్యోగాలు కాళ్ళ వద్దకు వస్తాయ్. నేను బి. ఏ. ప్యాసయినాను. ఆ మాట మర్చిపోకు" అన్నాడు శంకరం.

"ఆఁ ! ప్యాసయినావ్. ఏమిటి లాభం. నీకు వళ్ళు వంగదు. ఇంతకీ నువ్వు చేసుకోదల్చుకునే అమ్మాయి వ్రాత అలాగేఉంటే ఎవ్వరేం చేయగలరు? ఎక్కడ చూచావ్ సంబంధం?" అన్నాడు మామయ్య.

"ఎక్కడ చూడడం ఏమిటి— గౌరిని చేసుకొంటాను" అన్నాడు శంకరం.

"ఏమిటీ ? గౌరినే? దాని గొంతుకే కొయ్యాలని చూస్తున్నావా ? ఛస్తే దానిని నీకిచ్చి పెళ్లి చెయ్యను" అన్నాడు మామయ్య.

"నా కంటె దొడ్డసంబంధం నీ కెక్కడ దొరుకుతుందయ్యా" అన్నాడు శంకరం.

"అసలు నీదీ ఒక సంబంధమేనా అని" అన్నాడు మామయ్య.

"నాదే సంబంధం. నాది మేనరికం. నా తర్వాతే ఏ సంబంధం అయినా. 'మేనరికం తప్పించకు, నా కూతుర్ని చేసుకో' అని నువ్వు నన్ను బ్రతిమాలవలసిన మాట. అటువంటిది నేను అడుగుతూంటే బిర్రబిగిస్తున్నావ్" అన్నాడు శంకరం.

"మేనరికం అయినంత మాత్రాన ఒక అప్రయోజకుడికి పిల్ల నివ్వమని ఎక్కడా లేదు. నీ విలాసాలకి ఎక్కడా డబ్బు అందడంలేదు. గౌరిని చేసుకుంటే, నాకు భగవంతుడిచ్చిన నాలుగు డబ్బులూ నేను కళ్లు మూయగానే నీ చేతిలో పడతాయని నీ ప్లాను" అన్నాడు మామయ్య.

"ఇదిగో మామయ్యా! నువ్వు ఏమైనాసరే అను, కాని నేను నీ డబ్బుకోసం గౌరిని పెళ్లాడుతానంటున్నాని మాత్రం అనవద్దు. నాకు కావలసింది గౌరి కాని, నీ డబ్బుకాదు. గౌరిని చేసుకోవాలని నాకు, నన్నే చేసుకోవాలని గౌరికీ, మనసారా ఉన్నది. కావలిస్తే గౌరిని అడుగు" అన్నాడు శంకరం.

"చిన్నపిల్ల; దాని కేం తెలుస్తుంది? అయినా మా గౌరి అంత తెలివితక్కువదికాదు. నీ సంగతి దానికి బాగా తెలుసును. ఏమమ్మా! వీడిని పెళ్లి చేసుకోవడం నీకు ఇష్టంలేదుకదూ ?" అని అడిగాడు మామయ్య.

"బావ తెలివైన వాడు. తలుచుకొంటే ఏ ఉద్యోగం అయినా సంపాందించుకోగలడు" అన్నది గౌరి.

"అంటే నీ ఉద్దేశం ఏమిటి? ఓహో! డొంక తిరుగుడుగా ఇష్టమేనని చెప్పడమా ? సరిసరి విన్నుకూడా అప్పుడే లొంగదీశాడన్నమాట" అని మండి పడ్డాడు మామయ్య.

"ఏమిటి మాటలు ?" అంటూ గౌరి—తల్లి వంటింటిలోనుంచి వచ్చింది.

34వ పేజీ చూడండి



## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డు పైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు.1.25న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. ఛార్జీలు ప్రత్యేకం). దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపై నపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.**

## నాణ్యత మరియు పొదుపు కుటుంబం అంతటికి




# కాల్గేట్

బహుళ వినియోగ టాల్క్

అపురూపమైన పువ్వుల శాశ్వత సువాసనగలది!



# ప్రాప్తం

20—పేజీ తరువాయి

"నీ మొహం—మాటలు, చెవిటి మాలోకం" అన్నాడు మామయ్య.

"ఏమిటే గొడవ ?" అని గౌరిని అడిగింది గౌరి తల్లి. గౌరి మాట్లాడలేదు.

"గౌరిని వాడికిచ్చి పెళ్లిచెయ్యమంటున్నాడు" అని చెవితో అరిచాడు మామయ్య.

"ఇన్నాళ్లకయినా బుద్ధి పుట్టిందా నాయనా! ఎప్పటికైనా నీ నోటివెంట ఆ మాట వస్తుందా అనే చూస్తున్నాను. మీ చిన్నప్పుడు మీ అమ్మ, నేను అదే అనుకొనేవాళ్లం. గౌరి—పెళ్లిమాట నేను ఎప్పుడెత్తినా, మీ మామయ్య విరుచుకుపడిపోతారు" అన్నది గౌరి తల్లి.

"తమరి ఉద్దేశం అదే అన్నమాట. ఇక దయ చెయ్యి; చెవిటి మాలోకం" అన్నాడు మామయ్య.

"బావకి కట్నంకూడా ఇవ్వనక్కరలేదు" అన్నది గౌరి మళ్లా.

"వాడి గురించి నువ్వేమీ వకాల్తా పుచ్చుకో నవసరంలేదు. మీ అందరికీ అంత ఇష్టంగా ఉంటే, అలాగే కానివ్వండి. కాని, శంకరం! ఒక్క షరతు ఉద్యోగం చేస్తావో, వ్యాపారం చేస్తావో; నువ్వు స్వతంత్రంగా ఆర్జించడం మొదలెట్టాలి. నీకు ఒక సంవత్సరం గడువు ఇచ్చాను. ఈ లోగా నువ్వు కుటుంబాన్ని పోషించుకోగలవని నాకు ఋజువు చెయ్యాలి. అలాగైతేనే, నీకు గౌరినిచ్చి పెళ్లి చేయటం. ఇప్పట్లాగే మాత్రం నా కంఠంలో ప్రాణం ఉండగా, గౌరిని నీకు ఇవ్వడం కల్ల" అన్నాడు మామయ్య.

"అలాగ అన్నావ్ భేష్షైన మాట. సంవత్సరం వరకూ ఎందుకు, ఈలోగానే నా శక్తిసామర్థ్యాలు నీకు ఋజువు చేస్తాను. అప్పటివరకు మళ్లీ మీ ఇంట్లో కాలుపెట్టను" అని ప్రతిజ్ఞ చేశాడు శంకరం. వెంటనే వాళ్ల ఊరు వెళ్లిపోవడానికి సిద్ధపడ్డాడు.

## 2

ఇక ఏదో ఉద్యోగం చెయ్యక తప్పదు అనుకున్నాడు శంకరం రైలులో కూర్చుని. ఉద్యోగం చెయ్యడం అంటే, తనకు మొదటినుండీ అయిష్టమే. పోనీ ఏదైనా వ్యాపారం చేద్దామంటే పెట్టుబడిలేదు. ఇంతకూ తను ఎన్నాళ్లు ఉద్యోగం చెయ్యాలి ? మామయ్య కళ్లు మూసేవరకే. ఆ తర్వాత తన ఇష్టం. కొద్దికాలం ఏ కష్టం అయినా భరించాలి గౌరి కావాలంటే — నిజం చెప్పాలంటే మామయ్య ఆస్తితోసహా — ఇంకొక గత్యంతరం లేదు. కాని మామయ్య సంగతి చూస్తే ఇంత వేగం కళ్లు మూసే అవకాశం ఏ మాత్రం ఉన్నట్టు కనబడడం లేదు అనుకొన్నాడు శంకరం విషాదంగా నవ్వుకుంటూ.

తన ఆలోచనలతో రైలు—గమనాన్ని శంకరం గమనించలేదు. అప్పటి కప్పుడే విజయవాడ స్టేషను వచ్చింది. దిగేవారంతా దిగిపోయారు; ఎక్కేవారు ఎక్కుతున్నారు.

అప్పుడే తన సూటుకేసువంటిదే చేతితో పట్టుకొని, తను కూర్చున్న పెట్టెలోకే ఒక వ్యక్తి ప్రవేశించాడు. అంతేకాదు; తను కూర్చున్న చోటుకే

ఆ వ్యక్తి వచ్చాడు. ఈ సంఘటనతోటే శంకరం ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"మీ పక్కసీటు ఖాళీగా ఉందనుకుంటాను" అన్నాడు వ్యక్తి.

"ఖాళీగానే ఉన్నట్టుంది" అన్నాడు శంకరం, ఆ సూటుకేసువైపు చూస్తూ.

బల్ల క్రింద తన సూటుకేసు ప్రక్కనే, వ్యక్తి ఆ సూటుకేసు పెట్టి శంకరం ప్రక్కనే కూర్చున్నాడు. రెండు సూటుకేసులు అచ్చంగా ఒక్కలా ఉన్నై. ఇవి ఏ కంపెనీలోనో తోబుట్టువులు. ఇప్పుడిక్కడ అనుకోకుండా కలుగుతున్నై. ఇలాగే మనుష్యులు కూడా అనుకొన్నాడు శంకరం.

తన సూటుకేసువంటిదే ఇంకొకటి అదే బల్ల క్రింద ఉన్నట్టు తెలుసుకోవడానికి వ్యక్తికి అవకాశం లేకపోయింది.

"నేను వచ్చేసరికి మీలో మీరే ఏదో నవ్వుకొంటున్నారు" అన్నాడు వ్యక్తి.

"ఆఁ— అవును ఏదో జ్ఞాపకంవచ్చింది"అన్నాడు శంకరం.

"మీ రెంతవరకూ వెళ్తారు ?" అని అడిగాడు వ్యక్తి.

"ఏలూరు."

"ఏలూరు మీ స్వస్థలం అనుకొంటాను."

"అవును; అక్కడ మా ఇల్లు ఉన్నది" అన్నాడు శంకరం.

"ఏ పేటలో ?"

"—పేటలో."

"మా అత్తవారుకూడా ఏలూరే లెండి. అందుకని అడిగాను" అన్నాడు వ్యక్తి.

"అంటే మీ రిప్పుడు ఏలూరు వస్తున్నారా ?"

"లేదు లెండి. మరికాస్త దూరం పోవాలి."

శంకరంతో మాట్లాడుతున్నంతసేపూ వ్యక్తి కళ్ళుమాత్రం స్టేషనంతా పరికించి చూస్తున్నై. సంభాషణ ముగిశాక, ఆ పరిశీలన ఎక్కువ అయింది.

మొదటి ఘంట కొట్టారు. రెండవ ఘంటకూడా కొట్టేశారు. లౌడు స్పీకర్లు వీడ్కోలు సందేశాన్ని అందజేస్తున్నై. ఇంతలో ఆ చివరనున్న తలుపు తెరచుకొని ఒక పోలీసు సబ్ఇనస్పెక్టరు, ఇద్దరు జవాన్లు ఖంగారుగా ఆ పెట్టెలో వాళ్లని చూడగానే, వ్యక్తి హఠాత్తుగా లేచి, "అన్నట్టు మరిచిపోయానే" అంటూ చివాలున బెంచిక్రిందనున్న సూటుకేసు తీసుకొని ఈ చివరి ద్వారంగుండా నడుస్తున్న రైలులోంచి దిగివెళ్లిపోయాడు.

అతడి ప్రవర్తన శంకరానికి ఆశ్చర్యం కలిగించింది ఈ ప్రపంచంలో అనేక రకాల మనుష్యులు ఉంటారనుకొన్నాడు. తిరిగి తన పాత ఆలోచనలో పడ్డాడు. మామయ్య ఉన్నాడంటే అతడిది ఒక రకం. పిల్లికి బిచ్చం పెట్టడు. డబ్బుకోసం ఏ పని చెయ్యడానికైనా సిద్ధమే; మహా గడసరి. అటువంటివాడికి గౌరి వంటి అమాయకురాలు కుమార్తె కావడం ఆశ్చర్యం. తననే పెళ్లాడుతానని గౌరి తండ్రికి ఎంత సున్నితంగా చెప్పింది ! సాధ్యమైనంత త్వరలో గౌరిని పొందాలి. రైలు దిగిన ఉత్తరక్షణంనుండే తన కిక ఉద్యోగ ప్రయత్నమే అనుకొన్నాడు శంకరం.

పవరుపేట స్టేషను రాగానే పోర్టరుచేత పెట్టె దింపించుకొని, రిక్షాలో వేయించుకొని ఇంటికి వెళ్లిపోయాడు.

రైలులో తన సూటుకేసు, వ్యక్తి సూటుకేసూ మారిపోయాయని ఇంటివద్ద చూసుకొన్నాడు శంకరం. తన పెట్టెకు తాళం వెయ్యడం ఎన్నడూ అలవాటు లేదు. ఈ సూటుకేసుకు నిగనిగ లాడుతూ తాళం—కప్ప కనిపిస్తున్నది. ఏమి చెయ్యాలో శంకరానికి తెలియలేదు. పోలీసు స్టేషనుకు అప్పగించాలా ? పేపరులో ప్రకటన వేయించాలా ? అంతకంటే వ్యక్తి పేరూ, చిరునామా దొరికితే ఒక్క కార్డుముక్క వ్రాసి పడేస్తే, గొడవ ఉండదు అనుకొన్నాడు శంకరం. ఈ పెట్టెలో ఆ వివరాలు లభించవచ్చును. పెట్టె మూత తెరిచి చూడాలన్న నిశ్చయానికి వచ్చాడు శంకరం. వీలైనంతవరకూ పెట్టె పాడైపోకుండా వెనకనించి విప్పి, మూత తెరిచాడు.

పైదనే ఉన్న తువ్వాలు వగైరా ఏవో రెండు మూడు బట్టలు పైకి తీశాడు శంకరం. వెంటనే అతడి కళ్లు జిగ్గుమన్నై. పెట్టెలో వంద నోట్లు ఒక కట్ట చొప్పున కొత్త, నూరు—రూపాయల నోట్లు మూడు కట్టలు ఉన్నై.

ముప్పైవేలు; ముప్పైవేల రూపాయలు అనాయాసంగా, అనుకోకుండా తన చేతిలో పడిన్నై. ఈ సొమ్ము కేవలం దైవికంగా తన వద్దకు ఎందుకు చేరినట్టు ? ఏదో కారణం ఉంటుంది. శంకరం ఆలోచించాడు. తక్కున మెరుపులాంటి ఆలోచన కలిగింది.


ఈ సొమ్ము ఈ పళంగా మామయ్యకు చూపించి, ఇదిగో ముప్పైవేల రూపాయలు, ముప్పై నిముషాలలో ఆర్జించాను; ఇక గౌరినిచ్చి పెళ్లిచెయ్యమనవచ్చును. మామయ్య మరి కాదనలేడు. వచ్చినట్టు తన పెళ్లికి ఒప్పుకోవలసిందే. పెళ్లి అయ్యాక ఈ సొమ్ము ఏం చెయ్యడమో అప్పుడు గౌరితో ఆలోచించవచ్చును. అంతవరకు ఈ సొమ్ము తనవద్దనే ఉండాలి.

తన ఆచూకీ కనుక్కొని వెతుక్కుంటూ ఈలోగా ఆ వ్యక్తి వస్తాడేమో అని భయం పట్టుకుంది శంకరానికి. ముందు ఈ సూటుకేసు ఇంట్లో కనపడనివ్వకూడదు అనుకున్నాడు. మూడు నోట్ల కట్టలు పైకి తీశాడు. ఎంత బరువుగా, ఎంత అందంగా ఉన్నై. ఇంతసొమ్ము ఇదివరకు ఎన్నడూ తను చేతితో పట్టుకోలేదు. నోట్లు పరుపుక్రింద దాచాడు. పెట్టెలో ఇంకేమైనా ఉన్నాయేమో అని, అడుగువరకు చూచాడు. చెప్పుకోతగ్గవేమీ లేవు. వ్యక్తి పేరూ, ఎడ్రసు అసలు లేనేలేవు. తువ్వాలుతో సహా అన్నీ తిరిగి సూటుకేసులో పెట్టి మూత బిగించి తీసుకువెళ్లి, నూతిలో పారేశాడు. ఇక స్నానం, భోజనం చేసి కాస్సేపు విశ్రాంతి తీసుకోవడం, సాయంత్రం అలా బజారుకు పోయి ఒక హాండ్‌బ్యాగ్, గౌరికి పువ్వులు కొనడం, మళ్లీ ఈ రాత్రే మామయ్య ఇంటికి ప్రయాణం — ఇది తర్వాత కార్యక్రమం అని నిర్ణయించుకొన్నాడు శంకరం.

రాత్రి—ప్రయాణంలో ఒక సదుపాయం ఉన్నది. ప్యాసింజరు ట్రెయినులో కనీసం మూడు నాలుగు బోగీలలో దీపాలుండవు. చీకట్లో మీది బెర్తుమీద హాండ్‌బ్యాగు తలక్రింద పెట్టుకొని పడుకొన్నాడా, తనూ ఆ వ్యక్తీ ఇక తారసపడతామనే భయం ఉండదు.

## 3

శంకరం — పీడ వసకు వదిలినట్లే అనుకున్నాడు మామయ్య వాకిట్లో కూర్చుని. పీడు స్వశక్తితో భార్యా బిడ్డల్ని పోషించగలనని రుజువు చెయ్యడం సంవత్సరంలో కాదు, పది సంవత్సరాలలోనైనా జరగదు. గౌరిని శంకరానికి ఇవ్వడం తనకు సుతరాం ఇష్టంలేదు. ఉన్న ఒక్క పిల్లను లేనివాడికి ఇచ్చి పెళ్లి చెయ్యవలసినంత ఖర్మం



"...పైగా ఒక్కదమ్మిడీ పన్ను కట్టడు:..."

వీనొచ్చింది ? కాని గౌరి, దాని తల్లి కూడా ఈ శంకరం అంటే ఇష్టంగా ఉన్నారు. తను పెట్టిన షరతుతో పిల్లిద్దరి నోళ్లూ మూత పడినై. ఈ దెబ్బతో శంకరం తిరిగి ఈ ఇంట్లో కాలు పెట్టడం ఉండదు. అని అనుకుంటున్న మామయ్యకు చేతిలో హాండ్‌బ్యాగుతో సహా శంకరం ప్రత్యక్షం అయ్యాడు. మామయ్య గతుక్కు మన్నాడు.

"అదేవరు ? శంకరం ! నిన్న పెళ్లి ఇవ్వాళే తిరిగి వచ్చావేమిటి ? ఏవిధంగానైనా అర్జన ప్రారంభించేవరకూ మళ్లీ ఈ గుమ్మం తొక్కనన్నావే" అని హేళనగా పలకరించాడు మామయ్య.

"ఆ మాట అన్నవాణ్ణే మళ్లీ వచ్చానంటే దాని అర్థం గ్రహించుకో" అంటూ, ఆగకుండా శంకరం లోనికి వెళ్లిపోయాడు.

లోనికి చూచాడు మామయ్య. శంకరం తిన్నగా ఇనప్పెట్టె ఉన్న గదిలోకి వెళ్తున్నాడు. అతడి ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. తనకు జవాబు చెప్పూ నిలవకుండా సరాసరి ఇనప్పెట్టె ఉన్న గదిలోకి శంకరం వెళ్లడానికి కారణం ఏమిటి ? తన హాండ్‌బ్యాగు దాచడానికా ? ఎప్పుడు వచ్చినా తన సూటుకేసు చావిట్లో పారేసేవాడు. ఇప్పుడు భద్రంగా చేతి—సంచి దాచడానికి కారణం ఏమిటి ? దాని సంగతేమిటో తెలుసుకోవాలన్న అభిలాషతో మామయ్య వెళ్లి తలుపు చాటునుండి చూడడం మొదలెట్టాడు.

శంకరం గదిలోకి వెళ్లి తన హాండ్‌బ్యాగు తెరిచి గౌరికోసం తెచ్చిన పువ్వుల పొట్లం పైకి తీశాడు. నోట్ల కట్టలు భద్రంగా ఉన్నాయా లేవా అనే సందేహం కలిగింది. చేతిని తిరిగి సంచిలోనికి పోనిచ్చి చూచాడు. మూడు కట్టలు ఉన్నై. వాటిని పైకి తీసి ఒక్కసారి రెండు చేతులతో మనసారా పట్టుకున్నాడు. వాటి నిగారింపు కళ్లారా చూచి ఆనందించాడు. తిరిగి వాటిని యథాస్థానంలో జాగ్రత్తపరచి పువ్వులు పట్టుకొని గౌరి కోసం వెళ్లాడు.

అయ్య బాబో! ఎంత సొమ్మో ! అనుకున్నాడు మామయ్య. వీడికి ఎక్కడనుంచి వచ్చింది చెప్మా ? దొంగతనం చేశాడా అని మామయ్యకి అనుమానం కలిగింది. కాని వెంటనే దొంగతనం చేసిన డబ్బు మాత్రం కాదని నిశ్చయించుకొన్నాడు. తను శంకరాన్ని బాగా ఎరుగును. వాడికి కొన్ని దుర్గుణాలు ఉన్నమాట వాస్తవం. కాని అందులో దొంగతనం మాత్రం లేదు. పైగా దొంగతనం చెయ్యడానికి తెలివితేటలు ఉండాలి; అవి వీడికి శూన్యం. ఏవిధంగా ప్రాప్తించిన ధనమైనా ఇది వీడివద్ద ఉండడం ప్రమాదం, అనవసరమూను. పైగా వీ డిప్పుడు ఈ సొమ్ము చూపించి గౌరిని ఇచ్చి పెళ్లి చెయ్యమంటే ఏమిటి చెయ్యడం ? అది గాక, ఇప్పుడీ సొమ్మంతా తన చేతిలోనే పడాలనే మనస[illegible]ం మామయ్యది. మామయ్యకు మరి మనస్సు నిలవలేదు. ఎలాగైతే అలాగ అవుతుంది. అటునుంచి నరుక్కు రమ్మన్నారు పెద్దలు అనే నిశ్చయానికి వచ్చాడు మామయ్య. రెండు క్షణాలు పూర్తికాకుండా సంచిలోనుంచి మూడు నోట్ల కట్టలు తీసి తన ఇనప్పెట్టెలో పడేసి ఇనప్పెట్టె

# ప్రాప్తం

తాళం వేసి, ఏమీ ఎరగనట్టు చావిట్లోకి వచ్చి కూర్చున్నాడు మామయ్య.

మామయ్య చావిట్లోకి వచ్చి కూర్చున్నాడో లేదో, లోపలనుండి శంకరం వచ్చాడు. వెనకనుండి సిగ్గుపడుతూ గౌరి కూడా వచ్చింది.

"ఏంరా శంకరం! ఏమిటి కథ ?" అన్నాడు మామయ్య.

"మా పెళ్లి మాట ఏమిటి ?" అన్నాడు శంకరం.

"నిన్న అంత ఘర్షణ జరిగాక మళ్లీ మొదటికి వచ్చావా" అన్నాడు మామయ్య.

"ఆ మాట నాకు తెలుసును. ఈ క్షణంలో గౌరిని నా స్వశక్తితో పోషించుకోగలనని రుజువు చేస్తా ననుకో. మా పెళ్లి ఎప్పుడు చేస్తావ్ ?" అని శంకరం అడిగాడు.

"నీ ఇష్టం వచ్చినప్పుడు" అన్నాడు మామయ్య.

"ఆడిన మాట తప్పకు" అంటూ శంకరం వెళ్లి హాండ్‌బ్యాగు తీసుకొచ్చాడు. "ఇదిగో చూడు" అని బ్యాగులో చెయ్యి పెట్టాడు. పెట్టిన చెయ్యి

---

"మీ వయసెంత ?" అని అడిగాడు లాయరుగారు స్త్రీ సాక్షిని. ఆవిడ తటపటాయించింది.

"ప్రతినిముషం మీ వయస్సు అధికం అయిపోతోంది తెలుసా? త్వరగా చెప్పండి!" అని గదమాయించాడు లాయరుగారు.

కె. వి. ఎస్. (చీరాల)

---

పైకి తియ్యలేదు. మొహం మాత్రం వెలవెల బోయింది.

"ఏ—వీ, ఏవీ" అంటున్నాడు శంకరం.

"ఏమిటి" అన్నాడు మామయ్య.

"ముప్పైవేల రూపాయలు" అన్నాడు శంకరం.

"నీకేమైనా మతి పోయిందా ? సంచీలో చెయ్యి పెట్టి ముప్పైవేల రూపాయలు ఏవీ అంటా వేమిటి" అన్నాడు మామయ్య గట్టిగా.

"నేను తెచ్చాను."

"నీ కెక్కడివి ?"

"సంపాదించాను."

"దొంగతనం చేశావా ?"

"దొంగతనం చేసేటంత నీచుణ్ణికాను. నాకు దేవుడిచ్చాడు."

"అయితే ఆ దేవుడే మళ్లీ వాటిని మాయం చేసి ఉంటాడు."

"ఆపని నువ్వే చేశావని నా అనుమానం" అనేశాడు శంకరం.

"తెలివితక్కువగా మాట్లాడకు" అన్నాడు మామయ్య.

"ఇంకెవరు తీస్తారు ? నేను రాగానే చూచుకొన్నాను. మూడు కట్టలూ ఉన్నై. నేను తెచ్చిన పువ్వులు గౌరికి ఇచ్చి వచ్చేసరికి మరి లేవు. నువ్వు ఒక్కడివే ఇక్కడ ఉన్నావాయె" అన్నాడు శంకరం.

"అంటే నేను తీసినట్టే ? అసలు నీలాంటి దద్దమ్మ చేతి — సంచీలో ముప్పైవేల రూపాయలుంటాయని నేనెలాగ అనుకుంటాను ? ఇదో అభాండం నా నెత్తిని పడేస్తే భయపడి గౌరిని వెంటనే నీకిచ్చి పెళ్లిచేస్తా ననుకొన్నావా ? నీ అంతటి తెలివితక్కువవాణ్ణి కాను. అనవసర ప్రస్తావన కట్టిపెట్టు" అన్నాడు మామయ్య కోపంగా.

"ఛీ, ఏం బ్రతుకు" అనుకొన్నాడు శంకరం. ఒక క్షణంలో ఆశ, ఉత్తర క్షణంలో నిరాశ. ఏమి చెయ్యాలో తెలియలేదు. తల వేడెక్కి పోయింది. హాండ్‌బ్యాగు క్రింద పారేశాడు. "అలా కాస్సేపు తిరిగి వస్తాన" ని గౌరితో చెప్పి చర చర మెట్లు దిగి వెళ్లిపోయాడు.

## 4

ఎక్కడికి వెళ్తున్నాడో, ఎందుకు వెళ్తున్నాడో తెలియలేదు శంకరానికి. మెదడు ఒకటే దిమ్మె అయిపోయింది. "సార్ సార్" అంటూ ఎవరో వెంట పడ్డట్టు తెలుసుకోవడంతో ఆతడు తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు. ఎవరు పిలుస్తున్నదీ చూచాడు. "పేపర్ సార్" అంటూ ఒక కుర్రాడు చేతికి పేపరు అందించాడు. అప్రయత్నంగా జేబులో డబ్బులు తీసి వాడికిచ్చి పేపరు తీసుకున్నాడు. తను బజారులో ఉన్నట్టు తెలుసుకున్నాడు. ఎదురుగా కాఫీ — హోటలు కనిపించింది. దేహ, మానసిక పరిస్థితులు దుర్బలంగా ఉన్నై. ఒక కప్పు కాఫీ త్రాగాలనుకొన్నాడు.

కాఫీ త్రాగుతూ శంకరం పేపరువైపు చూచాడు. "భారీఎత్తున దొంగనోట్లు ముద్రిస్తున్నవారి అరెస్టు" అని పెద్ద అక్షరాలు కనిపించినై. "ఏమిటి" అనుకొని శ్రద్ధగా చదవసాగాడు: "నూరు రూపాయల నోట్లు దొంగతనంగా ముద్రవేయబడుతున్నట్టు సమాచారం తెలుసుకుని నిన్నటిదినం పోలీసు అధికార్లు ఫలానా ఊళ్లో దాడిచేశారు. అచ్చు అవుతున్నవి, చలామణికి సిద్ధంగా ఉన్నవీ — కొన్ని లక్షల విలువగల వంద—రూపాయల నోట్లు, వాటిని ముద్రిస్తున్న పరికరాలు దొరికాయి. అయితే ఇప్పటికే కొన్ని లక్షల విలువగల నోట్లు చలామణి అయిపోయినై. కాని, ఈ నోట్లు ఎవరు సరఫరా చేస్తున్నదీ, ఎవరు చలామణి చేస్తున్నదీ మొదలైన పూర్తి వివరాలు పోలీసులకు తెలిసిపోయినై. ఇంకా అనేకమంది (అందులో కొందరు ప్రముఖులు కూడా) త్వరలో అరెస్టు కాబోతున్నారు" అని ఉన్నది.

తనకు దొరికినవి దొంగనోట్లే; సందేహం లేదు అనుకొన్నాడు శంకరం. నిన్న రైలులో వ్యక్తి యొక్క ప్రవర్తన ఇప్పుడు తనకు బోధపడింది. ఎంత ప్రమాదం తప్పింది అనుకున్నాడు శంకరం. నిజంగా తను అదృష్టవంతుడే. సుమారు ఇరవై నాల్గు గంటలు దొంగనోట్లు తనవద్దనే ఉన్నై. ఎవరికి తెలిసినా, ఈపాటికి తను శ్రీకృష్ణ జన్మ స్థానంలో ఉండవలసింది. ఎందుకూ పనికిరాని

ఆ వెధవ నోట్లు పోయినందుకు సంతోషించకూడా ఇంతసేపు విచారించాడు కూడాను. ఎంత అవివేకం అనుకున్నాడు శంకరం. ఇంతకీ ఆ నోట్లు ఎలాగ మాయం అయినట్లు ? మామయ్య సంగతి తనకు పూర్తిగా తెలుసును. వాటిని అతడు కొట్టేశాడనే శంకరానికి నమ్మకం. కాని, అడిగితే తను తియ్యలేదని దబాయించాడు; తనను పరాభవించాడు కూడా. ఇప్పుడు అమాకి తెలిసి పోలీసులు పట్టుకుంటే మామయ్య—రోగం కుదురుతుంది అనుకొన్నాడు సంతోషంతో.

కాని, ఈ ఆలోచనతో శంకరం మనస్సు సమాధాన పడలేదు. ఇందులో కాస్త తన నేరం కూడా ఉన్నట్లు తోచింది. అవి దొంగనోట్లని మామయ్యని ఒకసారి హెచ్చరించడం న్యాయం. తన బాధ్యత తగ్గుతుంది. గౌరి తనని అపార్థం చేసుకోదు. ఆ తర్వాత మామయ్య ఖర్మం ఎలా ఉంటే అలా ఉంటుంది. కాఫీ త్రాగడం పూర్తిచేసి శంకరం తొందరగా ఇంటికి వెళ్లాడు.

మామయ్య యథాస్థానంలోనే కూర్చుని ఉన్నాడు. గౌరి కూడా అక్కడే ఉన్నది. శంకరం, మామయ్య పక్కనే కూర్చొని "నోట్లు నువ్వు తియ్యలేదన్న మాట నిజమేనా"అని అడిగాడు.

"అదిగో, మళ్లీ మొదలెట్టావ్ ? నీకు బుద్ధి ఉన్నదా లేదా ?" అని మామయ్య అడిగాడు తీవ్రంగా.

"తియ్యకపోతే బాధలేదులే. నీకు కారాగృహ ప్రాప్తి తప్పినట్లే. అవి దొంగనోట్లు" అన్నాడు శంకరం.

"ఏమిటీ" అన్నాడు మామయ్య అదిరిపడి.

"ఈ పత్రిక చదువు" అని శంకరం పెద్ద అక్షరాలు, మామయ్య కళ్లలో పెట్టాడు.

పత్రిక చదవడం పూర్తిచేసి మామయ్య "ఈ దొంగనోట్లు నీకెలాగ దొరికాయ్" అని అడిగాడు.

అవి తనకు ఎలాగ లభ్యమైనదీ, అవి దొంగనోట్లే అని తను నిశ్చయించడానికి గల కారణాలు శంకరం వివరంగా చెప్పాడు.

మామయ్య రెండు నిముషాలు మౌనంగా కూర్చొని "శంకరం" అన్నాడు.

శంకరం పలికాడు.

"నువ్వు చాలా మంచివాడివి"అన్నాడు మామయ్య.

"నేనే ?"

"మహా బుద్ధిమంతుడివి."

"నిజమే ?"

"నువ్వు నా మేనల్లుడు కావడం—"

"— 'అల్లుడు కావడం' అను."

"పోనీ, అలాగే అనుకుందాం — నా అదృష్టం. నువ్వు ఖర్చు చేస్తావన్న భయంకొద్దీ నీ ముప్పైవేల రూపాయలు నా ఇనప్పెట్టెలో దాచాను. కాని ఆలోచిస్తే, నా భయం అనవసరం అని తేలింది. నీ సొమ్ము నీకు తక్షణం ఇచ్చేస్తాను. తీసుకో" అన్నాడు మామయ్య.

"అయ్య బాబో! ఆ దొంగనోట్లు మాత్రం నాకు మరి అవసరంలేదు" అన్నాడు శంకరం.

"అవి నువ్వు తెచ్చిన నోట్లని మరిచిపోకు. నీ సొమ్ము నీ వద్దనే ఉండడం న్యాయం" అన్నాడు మామయ్య.

"నీ కీ న్యాయాన్యాయ విచక్షణ ఆ నోట్లు అపహరించినప్పుడు ఏమైందని ? ఇప్పుడు పోలీసులు ఏ క్షణంలో వచ్చి పడతారో అన్నప్పుడు ఆ దొంగనోట్లు మళ్లీ నా చేతిలో పెట్టి నన్ను వాళ్లకి అప్పగిద్దామనా నీ ప్రయత్నం?" అన్నాడు శంకరం.

"నీ సొమ్ము నేను అపహరించలేదు. నావద్ద దాచానని చెప్తున్నాను. ఇప్పుడు తిరిగి నీ నోట్లు నిన్ను తీసుకోమంటున్నాను. వయస్సు మళ్లినవాడిని ఇన్నాళ్లూ మర్యాదగా బ్రతికాను. ఇప్పుడు నన్ను ఖయిదుచేస్తే ఎంత అమర్యాద ఎంత అవమానం! ఇంతకీ ఆ దొంగనోట్లు నావి కావాయె. నా తప్పులు క్షమించు. ఇవి చేతులు కావు" అని మామయ్య ప్రాధేయ పడ్డాడు.

"నువ్వు ఇంత బ్రతిమాలాలా మామయ్యా ! ఆ సొమ్ము నేనే తీసుకొంటాను. కాని, ముందు ఆ ఇనప్పెట్టెమీద చెయ్యివేసి ఏ షరతూ లేకుండా గౌరిని నాకు సాధ్యమైనంత త్వరలో వివాహం చేస్తానని ప్రమాణం చెయ్యి" అన్నాడు శంకరం.

"మహా ప్రభో, గౌరిని నీకే ఇచ్చి సాధ్యమైనంత త్వరలో వివాహం చేస్తాను. ఈ ఇనప్పెట్టెలో నీ దొంగనోట్లు మినహా ఉన్న ధనం సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. ఇక నీ సొమ్ము నువ్వు తీసుకో" అన్నాడు మామయ్య.

"ఒక్క నిముషం ఆగు. ఇప్పుడు పోలీసులు వస్తే, ఆ సొమ్ము నాకు ఎలా దఖలుపడిందీ చెప్తాను. నేను నిర్దోషిని అని చెప్తాను. వాళ్లు నా మాట నమ్మి, నన్ను విడిచిపెడితే గొడవలేదు. కాని నా ఖర్మం కొద్దీ నాకు శిక్షపడింది అనుకో. అప్పుడో" అని అడిగాడు శంకరం.

"ఏముంది ? నువ్వు జెయిలుకి వెళ్తావు, వస్తావు. కాని, అంతవరకు రాదని నా నమ్మకం" అన్నాడు మామయ్య.

"అంతవరకూ వస్తే ? జెయిలులో పడ్డవాడికి గౌరినిచ్చి పెళ్లిచేస్తావా ? నీకు అప్రతిష్ఠకదూ ? నీ సంగతి నాకు బాగా తెలుసును. ఏదీ, ఇనప్పెట్టె మీద ఇంకొక్కసారి చెయ్యివెయ్యి. నేను ఖయిదుకు వెళ్లి ఎన్ని సంవత్సరాలకి తిరిగివచ్చినా అప్పటి వరకు గౌరిని నా కోసం అట్టేపెట్టి అప్పుడే నాకిచ్చి పెళ్లి చేస్తానని ఇంకొక్క ప్రమాణం చెయ్యి" అన్నాడు శంకరం.

"అదెలాగ అవుతుంది ?" అన్నాడు మామయ్య నిర్ఘాంతపోయి.

వీధి—తలుపు ఎవరో కొట్టిన శబ్దం అయింది.

"అదిగో, పోలీసులు వచ్చినట్టుంది" అన్నది గౌరి— ఇంతసేపు మౌనంగా ఉన్నది.

"వెంటనే ప్రమాణం చెయ్యి. లేకపోతే పోలీసులు వచ్చారు; వాళ్ళూ,నువ్వూ తంటాలు పడండి. నాకేమీ సంబంధం లేదు" అన్నాడు శంకరం.

"నువ్వు పరమ దుర్మార్గుడివి. ఈనాటికి నీచేతికి దొరికావని నీ ఇష్టం వచ్చినట్లు నాచేత ప్రమాణాలు చేయిస్తున్నావ్. సరే, కానీ; భగవంతుడి నిర్ణయం తప్పించలేం" అంటూ మామయ్య రెండవ ప్రమాణం కూడా చేశాడు.

గౌరి—తల్లి లోపలికి వచ్చి: "ఏమిటే అమ్మా! మళ్లీ గొడవా" అని కూతుర్ని అడిగింది.

గౌరి, శంకరానికి రైలులో ముప్పైవేల రూపాయల నోట్ల కట్టలు దొరికాయని, అవి తీరా ఇప్పుడు దొంగనోట్లని తెలిసిందని, పోలీసులు వచ్చి పట్టుకుంటారని భయంగా ఉన్నదని, ఏమిటి చెయ్యాలో తెలియడంలేదని టూకీగా చెప్పింది.


"దానికి అంత ఆలోచ నెందుకు ? ఆ నోట్లు ఇలా పారెయ్యండి. కాల్చి పారేస్తాను." అన్నది గౌరి తల్లి.

వీధి—తలుపుమళ్లీతట్టినట్టు శబ్దం వినిపించింది.

"నీపాటి తెలివి మాకు లేకపోలేదు; చెవిటి మాలోకం. బయట పోలీసులు తలుపు తట్టుతున్నారు. ఆ నోట్లు నువ్వు తగలెయ్యడం వాళ్ల కంట పడితే, మన అందరికీ బందిఖానా తప్పదు" అన్నాడు మామయ్య.

"ఇక నేను సిద్ధంగా ఉన్నాను. ఇన్నాళ్లకు గౌరి నాది అనే ధైర్యం కలిగింది. ఇక పోలీసులు కాదు; మిలిటరీ దండు వచ్చినా నాకు భయం లేదు. మామయ్యా! ఆ నోట్లు ఇలా పారెయ్" అన్నాడు శంకరం.

మామయ్య నోట్లు తీసి ఇచ్చాడు. గౌరి వెళ్లి శంకరం హోండుబ్యాగు తీసుకువచ్చింది. శంకరం నోట్ల కట్టలు లెక్కించి అందులో పెట్టాడు.




"మాక్లాస్‌లో అంతకన్నా పెద్దలెక్క నేర్పుతారు..."

మళ్లీ తలుపు కొట్టినట్టు ద్విగుణీకృతం అయిన శబ్దం వినిపించింది.

"మామయ్యా! ఇక మనం వెళ్దాం. పాపం! పోలీసులు చాలాసేపటినుంచి నిరీక్షిస్తున్నారు. వాళ్లని యిబ్బంది పెట్టడం క్షేమంకాదు. నేను హాల్లో నిలబడతాను. నువ్వు వీధి—తలుపు తీసి మాట్లాడకుండా, నన్ను వాళ్లకు చూపించు. తక్కిన వ్యవహారం నేను చూచుకుంటాను" అని మామయ్యతో చెప్పి, శంకరం "బై బై! గౌరీ! నాకోసం నిరీక్షిస్తావు కదూ" అని గౌరివద్ద శలవు తీసుకున్నాడు.

మామయ్య, శంకరం హాలులోకి వెళ్లారు. ఏమిటి జరుగుతుందో అని గౌరి, గౌరి తల్లి హాలులోకి వెళ్లి, ద్వారంవద్ద నిల్చున్నారు. చేతులు కట్టుకొని హాలు — మధ్య శంకరం నిలబడ్డాడు. మామయ్య వీధి—తలుపులు తెరిచాడు.

బయట పోలీసులు లేరు. వ్యక్తి నిలబడి ఉన్నాడు.

## 5

వ్యక్తిని గుర్తు పట్టడానికి రెండు క్షణాలు పట్టింది శంకరానికి. గుర్తుకురాగానే మహానందంతో "దొంగనోట్లబ్బాయ్, దొంగనోట్లబ్బాయ్" అని కేకలు వేస్తూ వెళ్లి అమాంతంగా వ్యక్తిని కౌగలించుకొన్నాడు.

"స్—కేకలు వెయ్యకు" అన్నాడు వ్యక్తి, పట్టు విడిపించుకొంటూ.

"నీకు మా మామయ్య ఇల్లు ఎలాగ తెలిసింది? అసలు నేనిక్కడ ఉన్నట్లు ఎలాగ తెలుసుకున్నావ్? మంచి సమయానికే వచ్చావ్. నిన్ను చూస్తే నాకు ఎంత సంతోషంగా ఉన్నదో తెలుసా? దొంగనోట్లబ్బాయి మామయ్యా" అని శంకరం ఉభయులకీ పరిచయం చేశాడు.

"మీ ఇల్లు ఏలూరులో ఫలానా పేటలో ఉన్నదని చెప్పావు కదూ. అదే ఆధారం. నీ పేరైనా నాకు తెలియదు. ఎలాగో మీ ఇల్లు కనుక్కున్నాను. తీరా మీ యింటికి వెళ్తే నువ్వు లేవు. వాకబు చేస్తే, ఇక్కడకు వచ్చినట్టు తెలిసింది. ఆ సూటు కేసులు రెండూ మారిపోవడం ఇంత యాతన పడవలసివచ్చింది" అన్నాడు వ్యక్తి.

"భగవంతుడే మార్చేసేడయ్యా. దానివలన నా కెంత ఉపకారం జరిగిందో తెలుసా—అదిగో చూడు; మా మామయ్య కూతురు గౌరి. గౌరిని నా కిచ్చి పెళ్లి చేస్తానని మామయ్య ఇప్పుడే ప్రమాణం చేశాడు. అదంతా నీ దొంగనోట్ల పుణ్యమా అని" అన్నాడు శంకరం.

"చాలా సంతోషం. కాని మాటిమాటికీ దొంగనోట్లని అనకు. గోడలకి చెవులుంటాయి" అన్నాడు వ్యక్తి.

"ఆ వచ్చింది ఎవరే? శంకరం నిన్ను చూపిస్తున్నాడు?" అని అడిగింది గౌరి—తల్లి.

వచ్చింది ఎవరో గౌరికి బోధపడింది. కాని అమ్మకి గట్టిగా చెప్పాలి. ఎదురుగా అతడు ఉన్నాడాయె. దొంగనోట్లు ఇతడివే అని ఎలాగ చెప్పడం? "ఎవరో బావ — స్నేహితుడి మల్లే ఉన్నాడు" అని మాత్రం చెప్పింది గౌరి.

"స్నేహితుడా? పోలీసులేమోనని మీ తండ్రి అనవసరంగా భయపడి పోయారు. బాగుంది" అని లోపలికి వెళ్లిపోయింది గౌరి — తల్లి.

# ప్రాప్తం

"పాపం! ఇంత కష్టపడి వచ్చావుకాని, నీ సూటుకేసు నావద్ద లేదు. ఏదో అయిపోయింది. నా సూటుకేసు నీవద్ద ఉన్నదికదూ; అది నువ్వు తీసుకో" అన్నాడు శంకరం.

"నా సూటుకేసు గురించి నేను రాలేదు. నా సొమ్ము నా కిచ్చేయ్. నీ గౌరిని నీవు పొందావు కదూ. ఇక నా నోట్లు నా కిచ్చేయి. అంతా కులాసాగా ఉందాము. కథ కంచికి, మనం మన ఇంటికి" అన్నాడు వ్యక్తి.

"నీకేమైనా మతి పోయిందా? ఇవ్వాళ పత్రికలు నువ్వు చూడలేదు? మీ దొంగనోట్ల వ్యాపారం పోలీసులకి తెలిసిపోయింది. మీ ముఠామైన వారు చాలా నిఘాగా ఉన్నారు. దానికి తోడు నువ్వు ఈ దొంగనోట్లు పట్టుకొని తిరుగుతూంటే నిన్ను వాళ్లు తప్పకుండా పట్టుకుంటారు. నీకు జెయిలు తప్పదు. నా మాట విను. ఇక ఆ నోట్లమీద భ్రాంతి పెట్టుకోకు" అన్నాడు శంకరం.

"అవి నీవద్ద ఉంటే, నీకు ప్రమాదం కదూ. ఆ బాధలేవో నేనే పడతాను. నా నోట్లు నాకిచ్చేయ్" అన్నాడు వ్యక్తి.

---

"నిన్నసలు ముద్దాయి దురుసుతనంతోనే కొట్టాడని చెప్పగలవా?" అని గదమాయించాడు డిఫెన్సులాయర్ గారు.

"లేదు; ఆయన నన్ను కర్రతో కొట్టారు!" రంగయ్య.

---

"నీ నోట్లు నీకు ఇవ్వడానికి నాకు ఏ మాత్రం కూడా అభ్యంతరంలేదు. కాని నీవలన నా కింతటి ఉపకారం జరిగింది కాబట్టి నీ మేలు కోరి చెప్తున్నాను. ఇంకొకసారి బాగా ఆలోచించుకో" అన్నాడు శంకరం.

"నా నోట్లు నాకు వెంటనే ఇచ్చేయ్" అన్నాడు వ్యక్తి కాస్త తీవ్రంగా.

"ఆ నోట్లు ఇంకొక నిముషం నా ఇంట్లో ఉండడానికి వీలులేదు. శంకరం! వారి నోట్లు వారికి తక్షణం ఇచ్చి పంపించు" అన్నాడు మామయ్య.

"అయితే సరే, రావయ్యా. ఇంతకీ ఒకళ్ల ఖర్మానికి ఇంకొకరు కర్తలు కాదు" అని శంకరం వ్యక్తిని లోపలికి తీసుకొని వెళ్లాడు. మామయ్య, గౌరి, వెంట వెళ్లారు.

"ఇదుగో, నీ నోట్లు తీసుకో" అని శంకరం హాండ్‌బ్యాగులోనికి చేతిని పోనిచ్చాడు.

నోట్ల కట్టలు లేవు.

"అరే! ఇవి మళ్లీ మాయం అయిపోయాయే! నువ్వు తీశావా మామయ్యా?" అన్నాడు శంకరం.

"ఆ వెధవ నోట్లు చస్తే నేను మళ్లీ ముట్టుకుంటానా? ఇంతకీ ఒక్క క్షణమైనా నువ్వు చూడకుండా నేను ఎక్కడికైనా వెళ్లానా?" అన్నాడు మామయ్య కోపంగా.

"మరి ఏమైనట్టు? ఇంట్లో ఇకెవ్వరూ లేరే" అన్నాడు శంకరం.

వ్యక్తి మొహం ఎర్రబడుతోంది.

"అమ్మ తీసిందేమో" అన్నది గౌరి.

గౌరి—తల్లికోసం ఇల్లంతా గాలించారు. చివరకు స్నానాలగది కనబడ్డది. బాయిలర్ వెలిగించి, అది మండుతూంటే పిడికెడేసి నోట్లు చొప్పున తీసి గొట్టంలోంచి మంటలోకి తోస్తున్నది. శంకరాది బృందం స్నానాలగది చేరేసరికి ఆఖరి పిడికెడు నోట్లూ ఆమె మంటలో వేస్తూండడం కన్పడ్డది.

"ఏ—ఏమిటి చేస్తున్నాది ఈమె" అన్నాడు వ్యక్తి వణుకుతూ.

"నోట్లన్నీ తగలేశాను. ఇక ఈ బూడిద కూడా కనిపించకుండా చేసేస్తాను. పీడ వదిలిపోతుంది" అన్నది గౌరి—తల్లి విజయవంతంగా.

నిల్చున్నపాటుగా మూర్ఛపోయాడు వ్యక్తి.

"అయ్యో! మూర్ఛపోయాడు పాపం! గౌరీ! కొద్దిగా నీళ్లుమొహంమీద చల్లు. ఆ విసినికర్ర ఇలా పడెయ్యి; విసురుతాను" అన్నాడు శంకరంకంగారుగా.

"ఆ దొంగనోట్ల కోసం మూర్ఛ కూడా పోవాలా? తెలివితక్కువ" అన్నాడు మామయ్య.

"అంతమాత్రానికి మూర్ఛపోయాడనుకోను. ఈ బాయిలర్ వేడికి తట్టుకోలేకపోయి ఉండాలి. కొందరు ఏమాత్రం వేడి భరించలేరు. మా ఊళ్లో ఒక వంట—బ్రాహ్మడు ఉన్నాడు. అతడి కొడుకు— పదహారేళ్లుంటాయి—భోగినాడు వాళ్లమ్మ తలంటి పోస్తూ, కాస్త వేడి ఎక్కువగా ఉన్న నీళ్లు ఒక చెంబు పోసేసరికి తెలివి — తప్పి పడిపోయాడు. పండగ మూడు రోజులూ మరి తెలివి రాలేదు— పదండి; ఇతణ్ణి బయటకు తీసుకుపోదాం" అన్నాడు శంకరం.

మామయ్యా, తనూ చెరొక వైపూ పట్టుకొని వ్యక్తిని బయటకు తీసుకువచ్చి పడుకోబెట్టారు. ముఖంమీద నీళ్లు చల్లి విసరడం మొదలు పెట్టింది గౌరి. ఐదు నిముషాలకి వ్యక్తికి తెలివి వచ్చింది. గౌరి ఇంట్లోకి వెళ్లి, వేడి కాఫీ తీసుకు వచ్చి నోట్లో పోసింది. వ్యక్తి తెప్పరిల్లి లేచి కూర్చున్నాడు.

"నీకు బాయిలర్—వేడి పడదా? లేకపోతే ఆ దొంగనోట్లు మా అత్త కాల్చివేసిందనే మూర్ఛపోయావా?" అని శంకరం అడిగాడు.

వ్యక్తి నీరసంగా చెప్పడం మొదలెట్టాడు: "మీరు పట్టి అయోమయం మనుష్యులు. మీకేమీ తెలియదు. మేము నోట్లు అచ్చు వెయ్యడమే కాని, వాటిని మార్చి అసలు డబ్బు చేసుకోలేము. వాటిని చలామణీ చేసేవారు మాకు కొందరుంటారు—పెద్ద పెద్ద వర్తకులూ, వాళ్లూను. మేము తయారుచేసి యిచ్చిన నోట్లు వాళ్లు మార్చి, వెయ్యి రూపాయలకి తిరిగి రెండు వందల రూపాయలు మాత్రం మాకు ఇస్తారు. వాళ్లు లోనవుతున్న ప్రమాదానికి తక్కిన ఎనిమిది వందలు వాళ్ల కమిషనే. ఆ ప్రకారమే పదిహేను రోజుల క్రిందట బెజవాడలో నేను, ఒక లక్షా ఏభై వేల రూపాయల విలువగల నోట్లు ఇచ్చి వచ్చాను. ఇప్పుడు—అంటే మొన్న—మొన్న వెళ్లి—"

"ఏమిటీ, ఏమిటీ అయితే కొంపతీసి యివి—" అన్నాడు మామయ్య గడగడ లాడిపోతూ.

"అవును" అన్నాడు వ్యక్తి హీనస్వరంతో.

"ఆఁ!" అంటూ, ఈసారి మామయ్యా అల్లుడూ మూర్ఛపోయారు. ★